


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

రాజేశ్వరి మర్నాడు పొద్దున్న పత్రికా విలేఖరుల సమావేశం పెట్టి, చుట్టుపక్కల ప్రాంతాలలో వరిపైరును ఆశిస్తున్న ఒక కొత్త చీడను తమ శాఖ అధికారులు కనుగొన్నారని, అదృష్ట వశాత్తు సమయానికి ఆచీడని కనుగొనటం వలన తగు చర్య తీసుకోవటం సాధ్యమైందని, వ్యవసాయ రంగంలోని ప్రముఖపరిశోధకుడు శ్రీ రాధాకృష్ణ వెంటనే దాన్ని నివారించే కొత్త సేంద్రియ మందుని కనిపెట్టారని, ఆ మందు ఆతరువాతి రోజునుండి ప్రతి రైతుకి పంచాయతీ కార్యాలయాల్లో, అన్ని 'అందరిల్లు' శాఖలలో ఉచితంగాఇవ్వబడుతుందనీ ప్రకటించింది. విలేఖరులు దానికి కావలసిన నిధులెక్కడివని అడిగిన దానికి భారతినిర్వహిస్తున్న 'అందరిల్లు' వ్యవసాయ పరిశోధన నిధి వారు సమకూర్చారని చెప్పింది.

1962 లో మూడవసారి జరిగిన ఎన్నికలలో రాజేశ్వరి పాల్గొనననిమొండికెత్తినా ఆమెను అటు పార్టీ వారూ వదలలేదు, ఇటు ప్రజలూ వదులుకోలేదు. ఈవిధంగా రాజకీయంగా ఆవిడ యాత్ర అప్రతిహతంగ సాగిపోయింది. అయితే ఇప్పుడు రాజేశ్వరి అసలైన నాయకురాలిగా రూపొందింది. ప్రజల మనసులలో సుస్థిరమైన స్థానం సంపాదించుకుంది. అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపడుతూ ముందుకు వెళ్తోంది. రానురాను రాజకీయాలలో విలువలు తగ్గిపోయి అవినీతి, ఆశ్రిత పక్షపాతము ఎక్కువైపోయి, ఒకరుఇంకొకరి మీద బురద చల్లుకోవడం ఎంత ఎక్కువైనా ఆమెను మటుకు ఎవ్వరూ వేలెత్తి చూపలేకపోయారు.

45

ఆగకుండా చలించటమే కాలం లక్షణం. పార్వతీశం అరవై ఏళ్ళ వయసు కొచ్చేసరికి దేశపరిస్థితులుఎంతో మార్పు చెందాయి. భారతదేశం అనేక రంగాలలో పురోగతిని చూపిస్తున్నా, దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది.

1962లో భారతదేశం, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం పార్వతీశం కుటుంబాన్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేసింది. శేషు ఆ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనటమే అందుకు కారణం ఉద్రిక్తతల కారణంగా తనను భారత్ చైనా సరిహద్దు ప్రాంతానికి పంపిస్తున్నారని శేషు ఉత్తరం వ్రాసిన కొద్ది రోజులలోనే యుద్ధం మొదలయ్యింది. యుద్ధ వార్తలను రేడియోలో వినటమే తప్ప శేషు నుంచి అరుదుగా వచ్చే ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. శేషు మిలిటరీలో చేరిన తరువాత ఒక్క సారి కూడా అన్ని ఏళ్ళల్లో ఇంటికి రానేలేదు. సెలవలు వస్తే దేశమంతటా, అదీ కాకపోతే విదేశాలకు వెళ్ళేవాడు. ప్రతి ఏటా ఎక్కడున్నాభారతి పుట్టినరోజుకు మటుకు శుభాకాంక్షలు చెప్తూ ఉత్తరం వ్రాసేవాడు. ఇంటికి ఫోను వచ్చాక చాలా అరుదుగా పార్వతీశంతో మాట్లాడేవాడు.

శారదమ్మ క్షేమం గురించి పార్వతీశంని అడిగి తెలుసుకునే వాడే కానీ, ఆమెతో మాట్లాడతాననిఅడిగేవాడు కాదు. హైమవతి అయినా ఒకటి రెండు సార్లు మాట్లాడిందేమో కానీ శారదమ్మ అతని నుంచి ఫోనువస్తే అక్కడ నిల్చుని వినేదే కానీ మాట్లాడే ప్రయత్నం కూడా చేసేది కాదు.

యుద్ధం మొదలైందని తెలియగానే భారతీయులందరూ ప్రధానమంత్రి సహాయ నిధికి విరివిగావిరాళాలు పంపటం మొదలు పెట్టారు. యుద్ధంలో మరణించిన సైనికుల కుటుంబాల కోసం భారతి‘అందరిల్లు’ తరఫున చాలా పెద్ద మొత్తంలో విరాళాన్ని ప్రకటించింది. అంతమొత్తంలో జవానుల కుటుంబాలసంక్షేమం కోసం విరాళం ప్రకటించిన వారు దేశం మొత్తం మీద ఎవ్వరూ లేరనే చెప్పాలి. పత్రికలన్నిటిలోయుద్ధవార్తలతో పాటు, ఈ వార్తనూ ప్రముఖంగా వేశారు. ‘అందరిల్లు’ దేశవ్యాప్త గుర్తింపునిసంపాదించుకుంది. ఆ విరాళం ప్రకటించటం వెనుక శేషు వ్రాసిన ఒక ఉత్తరం ఉంది.

భారతీ,

నీకు ఉత్తరం వ్రాసి చాలా రోజులయింది ఈ మధ్య. ఈ ఉత్తరం కూడా వ్రాస్తున్నానే కానీ, ఇది నిన్ను చేరుతుందో లేదో కూడా నాకు తెలియదు. దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి పోరాడుతున్న మాకు కుటుంబసభ్యులు సాధారణంగా గుర్తు రారు. కానీ నాకు నువ్వు గుర్తొస్తున్నావు చాలా తరచుగా. ఎందుకో తెలుసా?

ఈ భయంకర యుద్ధం మొదలవటానికి ముందు, నీ గురించి వార్తాపత్రికల ద్వారా ఎంతో తెలుసుకున్నాను. రవి బాబాయ్, నువ్వు కలిసి దేశానికి చేస్తున్న సేవ, మేము ఇక్కడ యుద్ధం చేసి చేస్తున్న సేవకి ఏ మాత్రం తీసిపోదని అనిపిస్తుంటుంది నాకు.

నిన్న ఏమైందో తెలుసా? నాతో పాటు నా పక్కనే నిలిచి శత్రువుల మీద తూటాల వర్షం కురిపిస్తున్న సంజయ్ తన ప్రాణాలు కోల్పోయాడు. పొద్దున్న ఇద్దరం కలిసి వెళ్ళాం. సాయంకాలానికి నేను వెనక్కిరాగలిగాను కానీ సంజయ్ శరీరం మాత్రమే వచ్చింది వంటినిండా నిండిన తూటాలతో. అతనికిపోయిన సంవత్సరమే పెళ్ళి అయ్యింది. భార్య ఇప్పుడు గర్భవతి. ఆ అమ్మాయి పరిస్థితి ఏమిటి?

మా శివకుమార్ నిరుపేద కుటుంబం నించి వచ్చాడు. నేను అతను పక్కపక్కన ఉండి శత్రువులనుఎదుర్కొంటుండగా అతని కాలులో దిగిన గుండు వలన కూలిపోయాడు. వైద్యం అందటంఆలస్యమయ్యి అతని కాలు తొలగించి వేశారు. అతని కుటుంబానికి అతనే అండ. భారతీ ఇలాఎందరో! రేపు నేనూ వారిలో ఒకడిని కావచ్చు. నాలాంటి వారు ఏమైనా ఫరవాలేదులే. అయినా వికలాంగుడిలా బ్రతికేకన్నా జాతీయ పతాకాన్ని వంటినిండా కప్పించుకోవటమే నాకిష్టం భారతీ.

ఈ యుద్ధంలో ఇప్పటికే వెయ్యికి పైన సైనికులు నేలకూలారు. ఇంకా ఎంత మంది బలి అవుతారోతెలియట్లేదు. ప్రాణాల గురించి భయమనుకుంటున్నావేమో. అది మా సైనికుల్లో ఎవ్వరికీ లేదు.ప్రాణాలకు తెగించి యుద్ధం చేస్తాం. శరీరంలో ఆఖరి నెత్తుటిబొట్టు ఉన్నవరకూ శత్రువులతో పోరాడతాం. కానీ మామీదే ప్రాణాలు పెట్టుకున్న కుటుంబాల గురించి నేనంటోంది. వాళ్లకి నువ్వు ఏమైనా చెయ్యగలవేమో ఆలోచించు. వాళ్ళ సంక్షేమానికి నువ్వేం చేయగలవు? వికలాంగులై ఉద్యోగాలనుంచి వెనక్కి వచ్చేస్తున్న అనేక వందలమంది సైనికులకు నువ్వు ఎలా సహాయ పడగలవు?

ఆలోచించు భారతీ! శాశ్వత పరిష్కారం ఆలోచించు. ఈ ఉత్తరం నీకు అందటం అంటూ జరిగితే...ఆలోచించు.

నీమీద ఈ హిమాలయాలంత ఉన్నతమైన నమ్మకంతో,

శేషు.

రాజేశ్వరిని కలిసి శేషు కోరికను గురించి చెప్పింది భారతి. రవి, నాగరాజులతో కూడా ఆలోచించినలుగురూ కలిసి సైనిక కుటుంబాల సంక్షేమం కోసం ఒక సంస్థను స్థాపించాలని నిర్ణయించారు. యుద్ధంముగిసిన తరువాతైతే ప్రభుత్వసహాయానికి కూడా ప్రయత్నిద్దామని రాజేశ్వరి అంది. అంత వరకు ఆగకుండా మొదట దేశవ్యాప్తంగా వచ్చే వార్తాపత్రికలలో ప్రకటనల ద్వారా సైనికుల కుటుంబాలకు ఎటువంటి సహాయం అవసరమైనా 'అందరిల్లు'ను సంప్రదించమని ప్రకటిద్దామని, యుద్ధానంతరం దేశరాజధానిలోనే ఒక సహాయసంస్థను స్థాపిద్దామని భారతి అంది. ఈ ఆలోచన అందరికీ నచ్చింది. పార్వతీశంగారు ఇది విని ఎంతో ప్రోత్సహించారు. శారదమ్మ తన పేర ఉన్న పొలాన్ని, నగలను అమ్మి ఆ సంస్థ స్థాపించేందుకు తీసికొమ్మని కోరింది. మొదటిసారి శేషు గురించి మాట్లాడింది ఆమె.

"నా కొడుకు శేషుని ఏనాడూ ఆదరించలేదు నేను. భారతమాత ముద్దుబిడ్డలైన వాడి తోటివారి కోసం ఈ మాత్రమైనా సాయం చేస్తే, వాడు నన్ను క్షమిస్తాడేమో..." అందరి మనసులు ఆర్ద్రమయ్యాయి ఆమె అన్నమాటలకు.

"ఇంత ప్రేమ పెట్టుకుని శేషు ఫోన్ చేస్తే ఎందుకు మాట్లాడవత్తయ్యా?" అడిగింది భారతి.

"ఏ మొహం పెట్టుకుని మాట్లాడేదే. వాడిని ఒక్కమారూ ఆదరంగా దగ్గరకు తీసుకోలేదు. వాడి గొంతువింటే నా గుండెల్లో పేరుకున్న దుఃఖం బయటకు రాకుండా ఆపలేను. ఇన్నాళ్ళూ లేని ఈ కొత్తబంధంలో వాడిని ఎందుకు ఇరికించటం?"

శారదమ్మ ఆరోగ్యం బొత్తిగా బాగుండటంలేదు. ఆమె గురించి ఇంటిల్లిపాదీ భయపడుతున్నారు. రవి, భారతే ఆమెను చూసుకుంటున్నారిప్పుడు.

రెండు పక్షాలలో వేలల్లో ప్రాణనష్టం తరువాత 1962 నవంబర్ నెలలో యుద్ధం ముగిసింది. యుద్ధం భారతీయులకు అనేక పాఠాలను నేర్పింది. ప్రతిరోజూ అయినవారి క్షేమసమాచారాల కోసం ఊపిరి బిగబట్టుకుని రేడియోలో వచ్చే వార్తలను వింటుండే వారు సైనికుల కుటుంబాల వాళ్ళు. ఆ రోజు మరణించిన వారి పేర్లలో, తమ వారి పేర్లు రాకూడదని భగవంతుడిని ప్రార్థిస్తుండేవారు. యుద్ధం ముగిశాక ఊపిరి పీల్చుకున్నారు అందరూ.

46

1964 లో భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అస్తమించారు. తరువాతి కాలంలో గుల్జారీలాల్ నందా, లాల్ బహదూర్ శాస్త్రి ల అనంతరంఅప్పటి రాజ్యసభ సభ్యురాలైన ఇందిరాగాంధీ భారత దేశపు తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

దేశం ఎదుర్కొంటున్న పేదరికం, నిరుద్యోగంతో పాటు నిరక్షరాస్యత, అధిక జనాభా సమస్యలుఎంతో ఎక్కువయ్యాయి భారతదేశంలో. క్రమక్రమంగా ప్రాంతీయవాదం కూడా ప్రాముఖ్యతనుసంతరించుకోవటం

మొదలుపెట్టింది. భాష ప్రాతిపదికగా రాష్ట్రవిభజన జరిగాక కూడా 1969 లో ప్రత్యేకతెలంగాణ కోసం ఉద్యమం ప్రారంభమయ్యింది. తెలంగాణ వారి హక్కుల రక్షణ కోసం ఉద్దేశించ బడిన జెంటిల్ మాన్ అగ్రిమెంట్‌నుఅమలుపరచమని మొదలైన తెలంగాణ ఉద్యమంలో 369 మందితెలంగాణా విద్యార్థులు అసువులు బాశారు.

ఆ ఉద్యమం కాస్త సద్దుమణిగింది అనుకునే లోగానే 1972 లో జై ఆంధ్ర ఉద్యమం మొదలయ్యింది. ఇది ఆ రోజులలో కోస్తా, రాయలసీమ జిల్లాలను ఒక ఊపు ఊపింది. సహజంగా గుంటూరుప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకున్న పార్వతీశం కుటుంబం ఈ ఉద్యమం వలన ప్రభావితమయ్యింది.

అప్పటికి నవయువకుడైన భారతి కొడుకు శ్రీరామ్ అనేకమంది తనవంటి యువకులతో కలిసి ఆ ఉద్యమంలోపాల్గొన్నాడు. కాలేజీలు మూత పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు తగలబెట్టబడ్డాయి. విద్యార్థులు అందరూ తెలంగాణ వారి ముల్కి నిబంధనలతో తమకు అన్యాయం జరుగుతోంది కనుక ప్రత్యేక రాష్ట్రం కావలసిందేనని ఉద్యమించారు.

గుంటూరులో 'శంకరవిలాస్' అన్న కూడలి అటు బ్రాడీపేటకు ఇటు అరండల్ పేటకు మధ్యలో ఉంది.ఆరోజు విద్యార్థులు అక్కడ ఉద్యమించారు. దానికి శ్రీరామ్ నాయకత్వం వహిస్తున్నాడు. వాతావరణం చాలాఉద్రిక్తంగా మారింది. సి ఆర్ పీ ఎఫ్ జవానులు రంగంలోకి దిగారు. విద్యార్థులు సోడాబుడ్లు వాడి, వారితోకలబడుతున్నారు. వారిని నియంత్రించటం కష్టమైన సందర్భంలో కాల్పులకు ఆదేశమివ్వక తప్పలేదు ఆ పేరామిలిటరీ అధికారికి. అంతే, ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. అందరూ తోచిన దిక్కుకు పరిగెత్తడంమొదలు పెట్టారు. అప్పటివరకు అందరికీ నాయకత్వం వహిస్తూ నినాదాలిస్తున్న శ్రీరామ్ తలలోంచి తుపాకీగుండు దూసుకు పోయింది. అతను ఒక్కసారిగా కూలిపోయాడు. అంతే... అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి. ఆ ఉద్యమంలో రమారమి 400 మంది దాకా విద్యార్థులు ప్రాణాలను బలిపెట్టారు.

భారతికి ఇది చాలా పెద్ద దెబ్బ. పొద్దున్న ఇంట్లో అన్నం తిని రాత్రికి వస్తానని చెప్పి వెళ్లిన కొడుకు,ఇలాగా రావటం? ఆమెలోని ధైర్యమేమైందో, ఆ వార్త వినగానే కుప్పకూలి పోయింది భారతి.

భారతి కన్నా డెబ్బై ఏళ్ళ వృద్ధుడు పార్వతీశానికి ఇది తట్టుకోలేని దెబ్బ అయ్యింది. ఉదయపు నడక వేళల్లో ఊతకర్రకు బదులుగా తనకు ఆధారంగా నిలిచి అడుగులు వేసే మనవడు ఏడి? పొద్దున్న లేవగానే

"తాతకి, నాకు పెద్ద గ్లాసెడు కాఫీ అమ్మమ్మా" అని వాళ్ళ అమ్మమ్మను అరిచి పిలిచే పసివాడు ఎక్కడ? ఎన్నోఒడిదుడుకులను తట్టుకున్న పార్వతీశం విధి చేసిన ఈ అన్యాయాన్ని మటుకు సహించలేకపోయాడు. కూతురినిఓదారుస్తున్నట్లే కనిపిస్తున్నా, ఆయన కుంగిపోయాడు.

హరిణి అన్నగారి మరణాన్ని జీర్ణించుకోలేక పోయింది. జీవితం తొలిమెట్టు మీద ఉన్న హరిణికి, కొన్నిన్ని సార్లు భగవంతుడు ఎంతో నిర్దయగా ఉంటాడన్నది ఊహకందని విషయం. శారదమ్మ, హైమవతుల కంటితడి ఆరట్లేదు. రవి మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. ఒక కొండలాగా దుఃఖాన్ని మోస్తున్నాడతను.

“నాన్నా, నేనే నీకు పోటీ. నీకు పోటీ లేదనుకుంటున్నావా? లా పూర్తి చేసి నీ ఎదురు ఇంట్లోనే ప్రాక్టీసు మొదలుపెడతా” అని శ్రీరామ్ తరచూ బెదిరిస్తుండేవాడు తండ్రిని.

ఢిల్లీలో ఉన్న రాజేశ్వరి వార్త వినగానే వెంటనే బయలుదేరి వచ్చింది. శోకమూర్తిలా కూర్చున్న చెల్లెలిని చూసి నీరుకారిపోయింది. ఆమె ఏనాడూ భారతిని అలా చూడలేదు. శ్రీరామ్ శరీరాన్ని చూసిన రాజేశ్వరి,భారతికంటే ఎక్కువగా రోదించింది. అందరిలోకీ చిన్నవాడు ఇలా అపమృత్యువు పాలవడం ఆమెనుకలచివేసింది. ఆ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో యువకులు వారి ఇంటిముందు సముద్రం పొంగినట్లు చేరారు. శ్రీరామ్‌కి జోహార్లు అర్పించారు.

అందరి నివాళుల అనంతరం శ్రీరామ్ శరీరాన్ని కేశవరావు పరిశోధనాకేంద్రానికి తరలించారు. ఆ శరీరం కూడా వైద్య విద్యార్థులకు ఉపయోగపడి ధన్యతనొందుతుంది. జరగాల్సిన కార్యక్రమాలను నాగరాజు, ముకుందం, మురారి దగ్గరుండి చూసుకున్నారు.

ప్రధాని ఇందిరాగాంధీ ప్రతిపాదించిన ఆరుసూత్రాలతో జై ఆంధ్ర ఉద్యమం చల్లారింది. భారతివంటి వందలాది తల్లులకు కడుపుశోకమే మిగిలింది.

47

ఆ మరుసంవత్సరం భారతికి పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది ప్రభుత్వం. బిడ్డకు లభించిన గౌరవానికి ఎంతో మురిసిపోయాడు పార్వతీశం. భారతి దంపతులు తల్లిదండ్రులు, హరిణి, శారదమ్మలతో సహా పురస్కార ప్రదానోత్సవానికి హాజరయ్యారు. మొట్టమొదటిసారిగా విమానం ఎక్కారు పార్వతీశం దంపతులు, శారదమ్మ. ఆకాశంలో తేలిపోతున్నంత ఆనందంతో నిండిన మనసులతో వారు ఆకాశంలోనే ప్రయాణించి దేశ రాజధానిని చేరుకున్నారు.
హృదయాలను పొంగించే మరో ఆనందం అక్కడ వారికోసం వేచి ఉంది.

ఢిల్లీ విమానం దిగగానే మిలిటరీ బట్టలలో ఉన్న ఒకతను వీరి కోసం ఉద్వేగంగా ఎదురుచూస్తూ ఉన్నాడు. భారతి అతన్ని చూస్తూనే పరిగెత్తుకు వెళ్ళి కౌగిలించుకుంది. ఆమె కళ్ళల్లోంచి ఆనందాశ్రువులు రాలటం మొదలయ్యాయి. అతని పరిస్థితీ అందుకు భిన్నంగా లేదు.

”భారతీ…” అనగలుగుతున్నాడంతే.

వెనుకగా నడుచుకుంటూ దిగిన శారదమ్మను నడిపించుకుంటూ వస్తున్నాడు రవి. ఆమె వెనుక పార్వతీశం, హైమవతులు వస్తున్నారు. హరిణి తాతయ్య చెయ్యి పట్టుకుని ఉంది.

శారదమ్మ వారి వద్దకు రాగానే అతను ఆమె వైపుకు రెండు అడుగులు వేశాడు. అతని మొహంలోకిచూసిన శారదమ్మ, ఒక్క సారిగా నివ్వెరపోయింది. ఆమెకు కళ్ళ ఎదురుగా సుబ్బారావు నిల్చున్నట్లు అనిపించింది. కళ్ళుతిరిగి తూలి పడబోయిన ఆమెను అతను గబుక్కున ముందుకు అడుగువేసి పట్టుకున్నాడు.

"శేషూ" అంటూ ఆమె అతని చేతుల్లో వేలాడిపోయింది. ఒక్కసారిగా అందరి మొహాల్లో ఆనందం నిండిపోయింది. శేషు తల్లిని నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకువెళ్ళి అక్కడ ప్రయాణీకుల కోసం వేసి ఉన్న కుర్చీల్లో ఒకదానిలో కూర్చోబెట్టాడు.

"శేషూ, ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు అమ్మను చూడాలనిపించిందిరా?" అతని మొహాన్ని తన చేతులలోకి తీసుకుని తనివితీరా చూస్తూ అంది శారదమ్మ. ఆమె కళ్ళు పదేపదే నీళ్లతో  నిండిపోతున్నాయి. తిరునాళ్ళలో తప్పిపోయి తల్లిని మళ్ళీ చేరిన చంటిపిల్లలా, శేషు చేతిని పట్టుకునే బయటకు నడిచింది. శేషు ఆమె మనసు అర్థం చేసుకున్న వాడిలా ఒక చేత్తో ఆమె చేతిని పట్టుకునే, వంగి చేత్తో పార్వతీశం, హైమవతుల పాదాలు తాకాడు. హరిణి తల నిమిరాడు. రవి, శేషుని దగ్గరకు తీసుకున్నాడు. అందరి మనసులు ఉత్సాహంతో నిండిపోయాయి. వారి బస చేరుకున్నాక అందరూ స్నానాలు చేస్తుండగా రవి, భారతులిద్దరూ ఉన్న దగ్గరకు వచ్చి అన్నాడు శేషు,

"భారతీ, నేను అమ్మను కలుసుకునేందుకు రావటానికి భయపడ్డాను. కానీ మీరు చెప్పింది నిజం. అమ్మ నన్ను చూసి పొందిన ఆనందం చూసాక, నేను రాకపోతే ఎంత పోగొట్టుకునేవాడినో అర్థమయ్యింది," అన్నాడు భారమైన గొంతుతో.

"మా అందరికీ దూరంగా ఉంది చాల్లేరా. అందుకే భారతితో నువ్వు మాట్లాడినప్పుడు నేనూ నిన్ను పదవీవిరమణ చేసి మాతో వచ్చెయ్యమంది. ఎంత మేమందరం ఉన్నా నువ్వు ఇక మీద ఆమె దగ్గర ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈమధ్య నీ మాట వచ్చినప్పుడల్లా వదిన కళ్ళు చెమ్మగిల్లు తున్నాయి."

శేషు తప్పు చేసినట్లు తల దించుకున్నాడు. భారతి వాతావరణం తేలిక చెయ్యటానికి నవ్వేసింది.

"శేషూ, మీ నాన్నకి మాట ఇచ్చినట్లు మీ అమ్మ మీ బాబాయిలందరినీ ఎంతో బాగా చూసుకుంది. వారి పెళ్లిళ్లు చేసి కుటుంబాలు ఏర్పరచి తన బాధ్యతలు తీర్చుకుంది. ఇప్పుడిక మీ నాన్న భయపడినట్లు నిన్ను చూసుకుంటూ, ఆయన తమ్ముళ్లను నిర్లక్ష్యం చేసే అవకాశమే లేదు. ఎందుకంటే ఆమెనే ఎవరైనా చూసుకోవలసిన రోజులు వచ్చాయి."

"నేనిక భరతమాత సేవ నుంచి నామాత సేవలోకి మారాలన్నమాట!" శేషు అన్న వెంటనే అతన్ని సరిదిద్దింది భారతి.

"కాదు, బ్రతికున్నన్నాళ్లు ఏదో రూపంలో భరతమాత సేవ చెయ్యాల్సిందే. దాంతో పాటు నీ కన్నతల్లి సేవ కూడా చెయ్యాలి ఇకనుంచి." రవి, శేషు నవ్వేశారు.

★★★★★

శేషు వచ్చాక భారతి జీవితంలో శ్రీరామ్ నిష్క్రమణతో చోటుచేసుకున్న స్థబ్ధత తొలగి పోయిందని చెప్పాలి. ఒక్క ఆమె జీవితంలోనే కాదు పార్వతీశం గారి కుటుంబ సభ్యులు అందరి జీవితాలు మళ్ళీ జీవంతో నిండాయి. వయోభేదం లేకుండా అందరూ శేషులో ఒక మంచి మిత్రుణ్ణి చూస్తున్నారు. రాముకి, రాగిణికీ, హరిణికీ అయితే శేషు ప్రాణం అయిపోయాడు. పార్వతీశం, హైమవతి, శారదమ్మలను కూర్చోబెట్టి తన యుద్ధఅనుభవాలను చెప్తుంటే వారు చెవులు ఒగ్గి వినేవారు. ఇక భారతి స్థాపించిన సైనికుల కుటుంబ సంక్షేమ సంస్థకార్యకలాపాలను మూడుపువ్వులు, ఆరుకాయలుగా విస్తరించాడు శేషు.

కృష్ణ, ముకుందం, మురారి, ప్రసాద్, రవి, శేషు అందరూ వీలైనప్పుడల్లా చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకుంటూ ఆ జ్ఞాపకాలలోతేలిపోతున్నారు. వీరితో పాటు కొత్తగా నాగరాజు  కూడా కలిసాడు. సందర్భం చూసి రాజేశ్వరికి ఆర్థికసహాయం చేసింది తానేనని పార్వతీశానికి చెప్పేసింది హైమవతి. భర్త కాళ్ళు పట్టుకుని కన్నీరు కార్చింది. కూతురిని అనుమానించినందుకు సిగ్గుపడ్డాడాయన. అదే సందర్భంలో అవినీతికి పాల్పడని కూతురిని చూసి గర్వపడ్డాడు కూడా.

48

రోజులు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారి పోతున్నాయి. పార్వతీశంగారు ఆరోగ్యంగా తిరుగుతూనే ఒకరోజు హఠాత్తుగా నిద్రలో కన్నుమూశారు. ఒక మహామనిషి జీవితం ముగిసి పోయింది. భరతమాత బానిసత్వపు సంకెళ్లు తెంచటానికి తనవంతు ప్రయత్నం చేసి, స్వతంత్ర భారత దేశానికి ఒక మంచి రాజకీయవేత్తను, సంఘ సేవకురాలిని, ముగ్గురు ఆణిముత్యాల వంటి  కొడుకులను అందించి సంపూర్ణమైన జీవితం గడిపి అనాయాస మరణం పొందారు పార్వతీశంగారు. ఊరు మొత్తం ఆయన మంచితనాన్ని వేనోళ్ళ పొగుడుతూ ఆయనను సాగనంపారు. ఆయన అందరి హృదయాల్లో చిరంజీవిగా మిగిలిపోయారు. అటువంటి వాళ్ళకు ఏ శిలావిగ్రహాలూ అవసరం లేదు. వాళ్ళకు ప్రజల గుండెల్లోనే మందిరాలుంటాయి.

ఆయన తదనంతరం ఆస్తులను భార్య, ముగ్గురు కొడుకులు, కూతుళ్లతో పాటు ఒక వంతు 'అందరిల్లు'కి వ్రాసారు. భార్య జీవిత పర్యంతం అనుభవించాక ఆమె తదనంతరం ఆమె పేర ఉన్న ఆస్తి కూడా,అందరిల్లుకే చెందాలని వ్రాసారు.

తన కూతుళ్ళు, అల్లుళ్ళనుద్దేశించి ఆయన వ్రాసిన ఒక ఉత్తరం ఆ వీలునామాకి జతపరచబడిఉంది.అందులో రాజేశ్వరి, నాగరాజులను ఇష్టమైతే 'అందరిల్లు' ట్రస్టీలుగా సేవలందించవలసిందని కోరారు. దానికి గౌరవవేతనం ఏర్పాటు చేయవలసిందిగా 'అందరిల్లు' నిర్వహణ మీద సర్వాధికారాలు ఉన్న భారతిని కోరారు. జీవితాంతం తన సంతానం అంతా అఖండ భారతంలా కలిసి ఉండాలని తన కోరిక అని వ్రాసారు.

ఆ ఉత్తరంలో విషయాలు విన్న రాజేశ్వరి కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంది.

"అందరిల్లు వంటి సంస్థకు సేవలందించటమే ఒక గౌరవం. నాన్న నేను తెలిసీతెలియక అమ్మమ్మగారు పోయినప్పుడు చేసిన రభసను మనసులో పెట్టుకుని ఇలా వ్రాసారేమో. నాకు ఏ వేతనం అక్కర లేదు. ఆనాటి నా ప్రవర్తనకు ఈనాడు మీ అందరినీ క్షమాపణ వేడుతున్నాను" అని పన్నెండవ రోజు కుటుంబ సభ్యులందరికీ చేతులు జోడించింది. అదే ఆమె పరిణతి చెందిందనటానికి నిదర్శనం.

ఆరవ లోక్సభ ఎన్నికలలో ఇందిరాగాంధీ ఓడిపోయినప్పుడు, తను గెలిచినా లోక్సభకు రాజీనామాచేసి, ప్రత్యక్ష రాజకీయాలనుంచి తప్పుకుంది రాజేశ్వరి. అప్పటికే దేశవ్యాప్తంగా అన్ని రంగాలలోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. తరువాత ఎన్నికలలో ఇందిరాగాంధీ మళ్ళా ప్రధానమంత్రి అయినప్పుడు కూడా, రాజేశ్వరికి అభ్యర్థిత్వం ఇవ్వడానికి అధిష్ఠానం సిద్ధపడ్డప్పటికీ రాజేశ్వరి తిరస్కరించింది.

మనసా, వాచా, కర్మేణా 'అందరిల్లు' కార్యకలాపాలలో పాల్గొంటూ, జీవితపర్యంతం సంఘసేవ చేశారు రాజేశ్వరి, నాగరాజులు. నాగరాజు తల్లిదండ్రులు కాలగర్భంలో కలిసి పోయాక, వారు తమ ఇల్లును రామరాజుకు ఇచ్చేసి, రాజేశ్వరి తోబుట్టువుల కోరిక మేరకు, హైమవతి అభ్యర్థన మేరకు వచ్చి పార్వతీశంగారి ఇంట్లోనే ఉండటం ప్రారంభించారు. హైమవతి భర్త మరణం తరువాత పూర్తిగా ఆధ్యాత్మిక జీవితానికి అంకితమై పోయింది. ఆవిడను, శారదమ్మను ఎవరికి వీలైతే వారు, వారు కోరిన తీర్థయాత్రలకు తిప్పారు.

'అందరిల్లు'కు ఎదురుగా ఉన్న పార్వతీశం గారి పాత ఇల్లుకూడా, ఆయన సంతానం అందరూ కలిసి కేశవరావు పరిశోధనాసంస్థకు విరాళంగా ఇచ్చేసారు.

రాగిణి, హరిణి కలిసి ఒక సంస్థను స్థాపించారు. చిన్న తరహా, కుటీర పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలలో స్థాపించదలచిన యువతీయువకులకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయం అందించే సంస్థ అది. శేషుతో ఆలోచించి, స్థాపించిన ఆ సంస్థ చాలా విజయవంతమయ్యింది. జాతీయం చేయబడిన బ్యాంకులద్వారా ఋణసహాయం అందేలా చూడటం, సంస్థలో పనిచేసే ఉద్యోగుల శిక్షణ అవసరాలను చూడటం వంటివి 'భారతీ సహాయసంస్థ' చూసుకుంటుంది.

ఆ సంస్థ పేరు పెట్టేప్పుడు భారతి చాలా వ్యతిరేకించింది. దాన్ని కూడా శయనమ్మఅందరింటినుంచి నిర్వహిద్దామన్నది. దానికి హరిణి చక్కని సమాధానమిచ్చింది.

"అమ్మా! శయనమ్మ అవ్వ పేరును నువ్వు చరిత్రలో శాశ్వతం చేసావు. మా అమ్మ పేరు కూడా అలా నిలిచిపోయేలా చేద్దామని నా ఆలోచన. కాదన వద్దు. నన్ను మాతృ ఋణం తీర్చుకోనియ్యి"

భారతి హృదయం ఆనందంతో బరువెక్కింది.

“అలాంటప్పుడు రాగిణి అక్క కూడా ఉంది కదా. మరి పెద్దమ్మ పేరు కూడా కలిసి వచ్చేలా చూడండి” అంది. దీనికి రాజేశ్వరి, నాగరాజు కూడా అభ్యంతరం చెప్పారు.

“భారతీ, నేను నిన్ను చూసి ప్రేరణ పొంది ఇందులోకి దిగాను. నువ్వు నాలో ఈ సంఘసేవాస్ఫూర్తిని కలుగజేసావు. ఎక్కడైనా స్ఫూర్తిప్రదాతల పేరుపెడతారే కానీ స్ఫూర్తి పొందిన వారిది కాదు. నన్ను వదిలెయ్యి,” అంది. రాజేశ్వరి అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించాడు నాగరాజు.

“పిన్నీ, నేను మొదలు పెట్టే సేంద్రియవ్యవసాయంలో కొత్తపద్ధతులను కనుక్కునే సంస్థకి, ‘రాజేశ్వరినవ్య వ్యవసాయ ఆవిష్కరణా కేంద్రం’ అని పేరు పెట్టి, మా అమ్మ పేరు నేను నిలబెడతాను.”అన్నాడు రాజేశ్వరి కొడుకు రాము. అందరూ నవ్వారు వాడి మాటలకి.

“మీరు చేస్తున్నది చాలా మంచిపని. తల్లి మనకు ప్రపంచంలో తొలిగురువు, దైవం. ఆమె తరువాతేఎవరైనా. మీ కన్నతల్లులు గర్వించే పని చేస్తున్నారు మీరు” అన్నాడు నాగరాజు.

ఆవిధంగా మొదలయిన రాము స్థాపించిన సంస్థ, ‘రాజేశ్వరి నవ్య వ్యవసాయ ఆవిష్కరణా కేంద్రం’ అనతికాలంలోనే వ్యవసాయానికి అవసరమైన ఎన్నో పనిముట్లను ఆవిష్కరించింది. కలుపుమొక్కలు తీయటం, విత్తు నాటటం, కోత కోయటం వంటి వ్యవసాయ పనులను సరళతరం  చేసే ఎన్నో పనిముట్లను అతి తక్కువ ఖర్చుతో కనుగొని దేశవ్యాప్తంగా ఖ్యాతినార్జించింది. ఆ సంస్థనుంచి పనిముట్లను కొనే రైతుల సంఖ్య లక్షల్లో ఉందిప్పుడు.

ఇక ‘భారతీ సహాయ’కు ఒక్క భారతదేశంలోనే కాక, విదేశాల్లో సైతం గుర్తింపు లభించింది. దానికి కావలసిన మూలధనాన్ని భారతి తనకు తండ్రి ఇచ్చిన ఆస్తిని, తల్లి తనకు ఇచ్చిన మొత్తం నగల్ని, రవి అనుమతితో అమ్మి, సమకూర్చింది. రాజేశ్వరి కూడా తన వంతు ఆస్తి అమ్మి కొడుకు పరిశోధనలకు ఇచ్చేసింది. అవసరాలను మించి ఉన్న ఆస్తిని దేశ ప్రయోజనాల కోసం విరాళంగా ఇచ్చే వీరివంటి వారు మరింత మంది ఉంటే దేశాభివృద్ధి సులభం కాదా? మనవలు, ముని  మనవళ్ల తరాలకు సరిపోయేంత ఆస్తి ఉన్నా, ఇంకా ఇంకా పోగేసేవాళ్ళు ఇటువంటి వారిని చూసి నేర్చుకోవాలి.

తల్లిదండ్రుల ప్రోత్సాహం, శేషు అండదండలతో పిల్లలు ముగ్గురూ మంచి పేరు తెచ్చుకుంటూ,ముందుకు సాగుతున్నారు. వారి ముగ్గురి అభిరుచులకు, మనస్తత్వాలకు తగిన జీవితభాగస్వాములు దొరకటం వారి అదృష్టమని చెప్పాలి.

49

జీవితపర్యంతం చేసిన కృషి వలన భారతికి ఎనలేని గుర్తింపు వస్తోంది. వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆమెను గౌరవించి, తమను తాము గౌరవించుకుంటున్నాయి. 'అందరిల్లు' నిధులు వేల కోట్లకు చేరుతున్నాయి, వితరణ కలిగిన ప్రవాస భారతీయుల విరాళాలతో. దానితో భారతి అంతకు ముందు స్థాపించిన కేశవరావు ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న పరిశోధనాకేంద్రాన్ని మరింత విస్తరించింది.

ఆధునిక కాలంలో తాగే నీరు, తినే తిండి కలుషితమై ఎన్నో కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి.

ప్రభుత్వం వైద్యరంగం మీద ఎంత ఖర్చుపెట్టినా సరిపోవట్లేదు. భారతి నెలకొల్పిన పరిశోధనాసంస్థలో ఎందరో యువ శాస్త్రవేత్తలు భిన్నతరహాలకు చెందిన రోగాలకు మందులు కనిపెట్టటానికి నిరంతరం కృషి చేస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే పరిశోధనలలో ఈ సంస్థ అగ్రస్థానంలో ఉంటుంది. కాన్సర్ గురించి, ఎయిడ్స్ గురించి మందులు కనిపెట్టటంలో ప్రపంచంలోని ప్రముఖ పరిశోధనాశాలలు అన్నిటి తోటి కలిసి పనిచేసింది ఈ సంస్థ.

★★★★★

1983 లో ఓ చారిత్రాత్మక సంఘటన జరిగింది. అది జరిగేవరకు ఎవరూ ఊహించను కూడా లేదు. సినిమారంగంలో తిరుగులేని కథానాయకుడుగా ఎదిగిన నందమూరి తారక రామారావు, 'తెలుగుదేశం'ప్రాంతీయ రాజకీయపార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లో ఆ పార్టీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారానికి తీసుకువచ్చాడు. అప్పటికి రాష్ట్రంలో నెలకొన్న పార్టీ స్థితులు, 'తెలుగువారి ఆత్మ గౌరవాన్ని నిలబెడదాం' అనే ఆయన నినాదం స్వాతంత్ర్య అనంతరం తొలిసారిగా కాంగ్రెస్‌ను తెలుగువారు నిర్ద్వంద్వంగా తిరస్కరించేలాచేశాయి. ఆయన విజయం భారతీయ రాజకీయాల్లో పెనుసంచలనాన్ని రేపింది.

ఇక భారతజాతికి అప్రదిష్ట మూటగట్టి ఇచ్చిన మరో సంఘటన 1984 లో జరిగింది. ప్రధానమంత్రి ఇందిరా గాంధీని, ఆమె వ్యక్తిగత రక్షణ సిబ్బందే కాల్చి చంపారు.ఇది బొత్తిగా ఊహించని భారతజాతి, నిశ్చేష్టమయ్యింది. తత్ఫలితంగా హింసాకాండ చెలరేగింది. . శాంతిని ప్రపంచానికి ప్రవచించే భారతదేశంలో హింసాత్మక సంఘటనలు విస్తరించటానికి పునాదిపడింది అప్పటినుంచే అని చెప్పవచ్చు. అప్పటివరకూ రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఇందిరాగాంధీ జ్యేష్ఠపుత్రుడు రాజీవ్ గాంధీ, ఆమెకు వారసుడిగా దేశప్రధాని పదవిని స్వీకరించాడు.

ఈ రాజకీయాలకు అతీతంగా ఉన్న భారతివంటి నిస్వార్థ సంఘసేవకులను మాత్రం భారత ప్రజలు నెత్తిన పెట్టుకుని, దైవసమానులుగా గౌరవిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా, ఏ రాజకీయ పక్షానికి చెందినదైనా వారిసేవలను గుర్తించక మానలేదు.

★★★★★

ఎనభయ్యవ దశకం చివరిలో భారతికి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ఆ సందర్భంగా భారతికి గుంటూరు ప్రజలందరూ కలిసి మొదటిసారి పౌరసన్మానం చేశారు.అదో చిరస్మరణీయమైన క్షణం. ఆమె మనసు నిండిపోయిన మహత్తర సమయం. ఏ ఊళ్ళో తాను పుట్టిపెరిగిందో, ఏ ఊర్లో తన జీవితంలో ఎన్నో అనుభవాలు చవి చూచిందో, తన పుట్టినిల్లు, అత్తిల్లు కూడా తానే అయ్యి ఏ ఊరు తనను ఆదరించిందో, ఏ ఊళ్లోని ప్రజలందరికీ తాను తల్లై, చెల్లై తిరుగుతోందో ఆ ఊరు తనని సన్మానిస్తోందంటే అంత కన్నా సార్థకత తన జీవితానికిక ఏముంటుంది? బిడి మొహం తెలియకుండా పెరిగిన తనకు అంత గొప్ప యూనివర్సిటీనుంచి డాక్టరేట్ రావటమంటే ఆ సర్వేశ్వరుడి కృప కాక వేరే ఏమిటి?

అందరి సమక్షంలో వేదికమీద రవి కాళ్ళకు నమస్కారం చేసింది భారతి. ప్రజలనుద్దేశించి మాట్లాడే ఆమె గొంతు వణికింది. తనను సంఘసేవ వైపు మళ్లించిన శయనమ్మను మనసారా తలచుకుని నమస్కరించుకుంది. తనను రవి ప్రోత్సహించిన తీరులో ప్రోత్సహించే భర్త దొరికితే, తాను చేసిన సంఘసేవ చెయ్యటం ఈ దేశంలో ఏ ఆడదానికి కష్టం కానే కాదంది. తాను సాధించిన విజయాలన్నీ తన కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే అని చెప్పింది. తన తండ్రి పార్వతీశం తనలో దేశభక్తిని అణువణువునా నింపాడని గుర్తు చేసుకుంది. వీరందరి సహకారంతో పాటు ప్రజల అభిమానము వల్లనే, వారి నమ్మకం తన మీద ఉండటం వల్లనే తాను ఇన్ని విజయాలను సాధించ గలుగుతున్నానని ప్రజలకు రెండు చేతులెత్తి అభివాదం చేసింది.

★★★★★

కాలం మరికొన్నేళ్లు ముందుకి కదిలింది. ఇందిరా గాంధీ తరువాత రాజీవ్ గాంధీ ప్రధానిగా స్థిరపడుతున్న సమయంలోనే ఆయన శ్రీలంక అధ్యక్షుడు అభ్యర్థన మేరకు ఆ దేశానికి 'పీస్ కీపింగ్ ఫోర్స్'పంపటం, అందుకు ప్రతీకారంగా ఎల్టీటీఈ రాజీవ్ గాంధీని హత్య చేయడం జరిగిపోయింది. ప్రపంచం మరోసారి నివ్వెరపోయింది. రాజీవ్ గాంధీ అనంతరం భారతదేశానికి పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయ్యాడు. నెహ్రూ కుటుంబేతరుడు భారత దేశప్రధానిగా పూర్తి ఐదు సంవత్సరాలు పదవిలో ఉండటంఆయనతోనే మొదలు. భయావహంగా ఉన్న దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చెయ్యటానికి అనేక ఆర్థికసంస్కరణలను ప్రవేశపెట్టాడు ఈ బహుభాషా కోవిదుడు, తెలుగువాడు అయిన ప్రధాని. దక్షిణభారతదేశంనుండి, అందునా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రధానిగా తొలిసారి పదవిని చేపట్టింది నరసింహారావే. రాజకీయ సిద్ధాంతాల కతీతంగా ఇది ప్రతి తెలుగువాడు గర్వపడ్డ విషయం.

★★★★★

భారతి ప్రధానమంత్రిని కలిసి అభినందించి ఆ సందర్భంగా ఒక విశ్వవిద్యాలయాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించేందుకు భూరివిరాళాన్ని ప్రకటించింది. అది దేశంలోనే అగ్రస్థానంలో ఉండేలాగా వసతులు,నాణ్యతాప్రమాణాలు

ఉండాలని అభ్యర్థించింది. భగవంతుడి దయవలన తమ ట్రస్ట్ ఎంత ఖర్చునైనా భరించగలదని, ప్రభుత్వ సహకారముంటే ఒక మంచి విశ్వవిద్యాలయ స్థాపన జరుగగలదని విన్నవించింది.

ప్రభుత్వం ఆమె కోరికను మన్నించింది. పీవీగారి పదవీకాలంలోనే ఆ విశ్వవిద్యాలయానికి పునాది పడింది. గుంటూరునుంచి తెనాలికి వెళ్ళేదారిలో ప్రభుత్వం పద్దెనిమిది వందల ఎకరాల స్థలం కేటాయించి నిర్మాణాన్నిచేపట్టింది. దానికి భారతి పేరే ఇవ్వ నిశ్చయించింది భారత ప్రభుత్వం. ఆ విధంగా 'భారతీ విశ్వవిద్యాలయం' రూపుదిద్దుకుంది.

★★★★★

భారతి భారతమ్మ అయ్యింది, రాజేశ్వరి రాజేశ్వరమ్మ అయ్యింది. శారదమ్మ కొడుకు శేషు ప్రేమను తనివితీరా అనుభవించి, ఆ ప్రేమలో తరించి, ఆ మధ్య కొడుకుని కాశీకి తీసుకు వెళ్ళమని అడిగి, అక్కడే కన్నుమూసింది. ఆమె అపరకర్మలను ముగించి శేషు వెనక్కి వచ్చాడు.

"మళ్ళీ మీ అందరితో కలవటానికి కారణమైన అమ్మ కన్నుమూసింది. ఇంకా ఎవరికోసం నేను ఇక్కడుండాలి?" అన్నాడు శేషు.

"ఇంకా దేశంలో ఈ ప్రాంతం నాది, ఇది కాదు అని నీకు అనిపిస్తుంటే అల్లాగే ఎక్కడికి వెళ్లాలనిపిస్తే అక్కడికి వెళ్ళు, కానీ వెళ్ళేముందు ఆలోచించు. జీవితమంతా ఎక్కడ గడిపినా చరమాంకంలో పుట్టి పెరిగిన చోటుకు వెళ్ళటానికి, అక్కడ నివసించటానికీ అందరూ ఎంతో కష్టపడతారు. నువ్వు అక్కడే ఉన్నావు అదృష్టవశాత్తూ. నువ్వు చేసే మంచి ఎక్కడినుంచైనా చేయవచ్చు. నీకు మేము లేమా?" అన్నారు భారతి, రవి.

దాంతో శేషు ఆగిపోయాడు.

శారదమ్మ వెళ్లిపోయిన రెండేళ్లలోపే హైమవతమ్మ జీవితనాటకంలో తన పాత్రను ముగించుకుని నిష్క్రమించింది. పోయేటప్పుడు రాజేశ్వరి, భారతి, ముకుందం, మురారి, వారి పిల్లలందరూ కూడా ఆమె చుట్టూ ఉన్నారు.

"పూర్తి జీవితం మీ అందరితో హాయిగా గడిచి పోయింది. తీరని కోర్కెలు లేవు, ఏ అసంతృప్తులు లేవు. ఆ శివయ్య నన్ను పిలుస్తున్నాడు, నేను వెళ్తున్నాను. మధ్యలో నా ఆలోచనలు వక్రమార్గం పట్టినా, దేవుడి లాంటి నా భర్త సాన్నిహిత్యంలో, ఆయన దయ వలన మళ్ళా సవ్యమార్గాన్ని పట్టగలిగాను. పంచాక్షరితో నన్ను సాగనంపండి" అని అందరూ 'ఓంనమశ్శివాయ' అంటుండగా, కొడుకులిద్దరు నోట్లో తులసితీర్థం పోస్తుండగా నిర్భయంగా ప్రాణాలు వదిలింది హైమవతి.

★★★★★

సేవాకార్యక్రమాలు తప్ప వేరేవి ఎరుగని భారతి జీవితంలో మరో పది సంవత్సరాలు ముందుకు జరిగాయి, దేశం మరో శతాబ్దానికి పరుగులు తీస్తోంది. మనుషులు చేసే ఎన్నో పనులను చెయ్యటానికి మెషీన్లుకనిపెట్టబడుతున్నాయి. ప్రతి

చిన్నదానికీ మెషిన్లే. ఏ రంగంలో చూసినా ఊహించలేని మార్పు. ఎడ్లబండ్లు, గుర్రపుబండ్లు మాయమైపోయి సైకిల్ రిక్షాలు, ఆటోలు, ఆపైన టాక్సీలు రోడ్ల మీద నిండుతున్నాయి. చేత్తో రాసే అలవాటు పోయి కంప్యూటర్లు వచ్చాయి. మనిషి అంతరిక్షంలోకి వెళ్ళి రావటం అనే మాట అటుంచి వెళ్ళి అక్కడ నివసించే ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. సినిమాలు నాటకరంగాన్ని జనం పూర్తిగామరచేలా చేస్తే, టీవీలు సినిమాల నెత్తిన ఒక మొట్టికాయ వేసి మరీ పక్కకి నెడుతున్నాయి.

ఇళ్లల్లో కూడా మనుషులు చేసే పనులకు మెషీన్లు వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు పార్వతీశం కుటుంబం నవ్వుకుంది కానీ, ఇల్లు తుడిచేందుకు వాక్యూమ్ క్లీనర్లు, వండుకోవటానికి కుక్కర్లు, కరంట్ స్టవ్లు, బట్టలు ఉతకటానికి వాషింగ్ మషిన్లు, గిన్నెలు కడగటానికి డిష్ వాషర్లు మనుషులను వెనక్కి నెట్టి మరీ ముందుకు వచ్చేసాయి.

ప్రపంచం వై2కే కి భయపడి పోయింది. ప్రపంచంలోని కంప్యూటర్ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుంది అని వణికిపోయింది. జనవరి 1, 2000 న సంభవించబోతోంది అని ఊహించిన ప్రమాదాన్ని నిరోధించటానికి కంప్యూటర్ రంగంలో నిపుణులు ఎంతో కృషి చేశారు. కంప్యూటర్ ఆధారిత రంగాలన్నిటికీ ఎటువంటి ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చినవారి మాట నిలబెడుతూ కొత్త శతాబ్దం మొదటి రోజున కంప్యూటర్లు బుద్ధిగా పని చేశాయి. ప్రపంచమంతా ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంది.

సాంకేతిక పరిజ్ఞానం ఏ మాత్రం లేని రవి, భారతి కంప్యూటర్ వాడకం పిల్లల నుంచి నేర్చుకున్నారు. విదేశాలలో ఉన్న బంధుమిత్రులతో కంప్యూటర్ ద్వారా సంభాషించటం అలవాటు అయ్యింది వారికి. ముఖ్యంగా కృష్ణ పిల్లలు అమెరికాలో ఉన్నారు. వారితో మాట్లాడనిదే, ఇంట్లో వారెవ్వరికీ తోచదు.

భారతసమాజం అనేక మార్పులకు లోనయ్యింది. మహిళలు కూడా ఉద్యోగాలు చెయ్యటం కొత్త శతాబ్దంలో తప్పనిసరి అయ్యింది. . పురుషులతో సమంగా ఉద్యోగాలు చేసే స్త్రీలు ఎక్కువయ్యారు. పట్టణీకరణఎక్కువై, గ్రామాల్లో రైతులు కూలీలుగా పట్టణాలకు వలస పోవటం మొదలైంది. చదువుకున్న గ్రామీణులపిల్లలు ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు పోతున్నారు తప్ప, స్వయం ఉపాధికోసం ప్రయత్నించడం లేదు. పెరిగిన వైద్యప్రమాణాల వలన ప్రజల ఆయుఃప్రమాణం పెరిగింది.

## 50

21వ శతాబ్దంలో మొదటి దశాబ్దం సగ పడేసరికి భారతి తరం వారు ఊహించని ఎన్నో సామాజికమార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని ఆహ్వానించదగ్గవయితే, మరికొన్ని విచారించక తప్పనివి. ముఖ్యంగా వృద్ధులకు ఇళ్ళలో ఆదరణ తగ్గింది. పెద్దల మాటలకు గౌరవం ఇవ్వటం అటుంచి వారి మాటలు వినే దిక్కే లేకుండా పోయింది. క్రమేపీ తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవటం అనే రోజులు పోయి వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. మానవసంబంధాలంటే ఏమిటి అని ప్రశ్నించే రోజులొచ్చాయి. కుటుంబమంటే అత్తమామలు, కొడుకు కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్లు అనే రోజులు పోయాయి.

మొగుడు, పెళ్ళాం, పిల్లలే కుటుంబం అనుకునే రోజులు వచ్చాయి. అత్తలకు కోడళ్లంటే గిట్టట్లేదు, కోడళ్ళకు అత్తలంటే సొక్కట్లేదు. పెద్దవాళ్ళు ఒక్క మాట చెప్పబోయినా పిల్లలు, 'మీకేం తెలుసు?' అనే రోజులు వచ్చాయి.

అదే ప్రపంచ ప్రఖ్యాతమైన భారత కుటుంబవ్యవస్థ వినాశనానికి పునాది అని చెప్పవచ్చు. అయితే ఇన్ని మార్పులు చుట్టూరా చోటు చేసుకుంటున్నా, సంబంధాలకు, అనుబంధాలకు విలువనిస్తూ కలిసి ఉంటోంది భారతి కుటుంబమే. రాజేశ్వరి, భారతి, ముకుందం, మురారులు, వారి కుటుంబసభ్యులు, వారి తదనంతరం వారి వారసులు, వీలైనంత వరకు పార్వతీశం ఇంట్లోనే ఉంటారు. తమతమ పనుల మీద ఎక్కడున్నా, సంక్రాంతి, దసరా, దీపావళి, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగలను కలిసి జరుపుకుంటారు. చిన్ననాటి జ్ఞాపకాలను తిరగబోసుకుంటుంటారు. భారతదేశం లోని భిన్నత్వంలో ఏకత్వాన్ని మనం ఆ ఇంటిలో చూడవచ్చు. అదే **భారతీయం!** మన సంస్కృతికి పట్టుగొమ్మలు ఇటువంటి ఇళ్ళే.

ముఖ్యంగా చెప్పుకోవలసిన విషయమేమిటంటే, ఆ కుటుంబంలోని వారందరూ ప్రభుత్వమో, ఇతరసంస్థలో ఇచ్చే ఉద్యోగాల కోసం ఎదురుచూడరు. వారే స్వయం ఉపాధి చూసుకుని, కొన్ని వందలకుటుంబాలలోని వారికి ఉద్యోగాలిస్తూ, ఆ కుటుంబాలు నిలబడటానికి సహాయపడుతుంటారు. అందుకే వారి కుటుంబం మాట వస్తే చుట్టుపక్కల వారందరూ చెయ్యెత్తి నమస్కరిస్తారు.

★★★★★

ప్రపంచపు అతి పెద్ద ఎన్నికలుగా చెప్పబడే, దగ్గర, దగ్గర ఎనభై ఒకటిన్నర కోట్ల మంది ఓటు హక్కును కలిగి ఉన్న భారత దేశపు 2014 లోక్ సభ ఎన్నికలలో గెలిచి, నరేంద్ర మోదీ భారతదేశపు ప్రధానిగా తొలిసారి,2019 ఎన్నికలలోనూ విజయఢంకా మ్రోగించిరెండవ సారి ఎన్నుకోబడ్డాడు.

నరేంద్ర మోదీ రెండవసారి ప్రధానమంత్రి అయ్యేవేళ్టికి భారతి వయసు ఎనభై తొమ్మిది సంవత్సరాలు.నిత్యం చేసే యోగా, ధ్యానం ఆమెను ఇంచుమించు యోగినిగా మార్చేశాయి. అందువల్లనే అంతకు ఐదుసంవత్సరాల పూర్వం తొంభై ఒక్క ఏళ్ళ వయసులో తన భర్త రవి తనను వదిలి దేహం విడిచేటప్పుడునిబ్బరంగా అతని చేతిని తన చేతులతో పట్టుకుని పక్కనే కూర్చుంది.

చివరిసమయంలో అతని కళ్ళల్లోకి చూస్తూ "నేనూ తొందరలో నీ దగ్గరకే వస్తాను రవి మావయ్యా. ఎక్కువ ఆలస్యం చెయ్యనులే" అని చెప్పింది.

"మొగుణ్ణి పేరుతో పిలువకూడదే బంగారం..." అంటుండగానే రవి కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయాయి.

అంతకు దశాబ్దం ముందునించి ఒక్కరొక్కరుగా ఆమె కుటుంబంలో ఆమెకంటే పెద్దవారందరూ కాలగతి చెందినప్పుడు రవి ఆమెను "పండిన ఆకు రాలదా?" అని ఓదార్చేవాడు. ఇద్దరూ కలిసి తమను తాము మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచుకున్నారు కనుకే పూర్ణాయుష్కులయ్యారని చెప్పవచ్చు.

ఉపసంహారం

భారతి బాధ్యతలలో చాలావరకు రాగిణి, హరిణి, రాములకు వదిలితే, వారు వారి కుటుంబసభ్యుల సహకారంతో 'అందరిల్లు' ట్రస్ట్ బాధ్యతలను అత్యంత సమర్ధవంతంగా నిర్వహిస్తూ, అందరి మన్ననలను పొందుతున్నారు. భారతి ప్రశాంత జీవనం గడుపుతూ ట్రస్ట్‌కు సలహాదారుగా మాత్రమే ఉంటోంది. తరువాతి తరాన్ని దేశసేవకు తీర్చిదిద్దటమే ఆమె లక్ష్యం.

శతాబ్దకాలం నాడు శయనమ్మచేత ఒంటిరెక్కతో స్థాపించబడిన 'అందరిల్లు' ఈనాడు ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మందికి ఎన్నో రూపాలలో అండదండగా నిలుస్తోంది.

భారతి, రవి తమ జీవితకాలం కష్టపడి. ట్రస్ట్ నిర్వహణ కని ఏర్పరచిన నియమావళి, దానినొక శాశ్వతవ్యవస్థగా, మనుషుల చావుబ్రతుకులకతీతంగా, ఎన్నటికీ ఉండిపోయే సంస్థగా తీర్చిదిద్దింది. ఈనాటికీ 'భారతి సహాయ'కి, 'అందరిల్లు' ట్రస్ట్‌కీ ప్రపంచం నాలుగుమూలల నుంచి ప్రతిరోజు కోట్లలో విరాళాలు వచ్చిపడుతూనే ఉన్నాయి, సద్వినియోగం అవుతూనే ఉన్నాయి.

అందుకే భారతి "భారత రత్న" అయ్యింది.

సర్వేజనాః సుఖినోభవంతుః!

శుభం

COMMENTS